క్లుప్తంగా

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వేడుకలు


పూజలు అందుకుంటున్న గణపయ్య

ఒంగోలు మెట్రో: సంకటహర చతుర్థి సందర్భంగా నగరంలోని గణపతి ఆలయాలలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక శ్రీనగర్ కాలనీ మొదటి లైన్లోని శ్రీ విజయ గణపతి దేవస్థానంలో స్వామివారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకుడు విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి విశేష పుష్పమాలికలతో అలంకరణ చేసి అష్టోత్తర శతనామాలతో అర్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ @ డీ మార్ట్

- ఒంగోలులోని డీ మార్ట్ ఎదురుగా రోడ్డుపై మట్టి తోలిన కార్పొరేషన్ అధికారులు
- డీ మార్ట్ వద్ద సాధారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య
- సెలవు రోజుల్లో మరింత జటిలం
- అదే సమయంలో మట్టి తోలకంతో సమస్య మరింత పెరిగి ప్రజలకు అవస్థలు


డీ మార్ట్ ఎదురుగా రోడ్డుపై తోలిన మట్టి కుప్పలు

ఒంగోలు వన్‌టౌన్: నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం, అనాలోచిత చర్యలతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. ఒంగోలులోని డీ మార్ట్ వద్ద చోటుచేసుకున్న ట్రాఫిక్ సమస్యే అందుకు నిదర్శనంగా ఉంది. డీ మార్ట్‌కు అధిక సంఖ్యలో వచ్చివెళ్లే వారితో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. దీనివల్ల సహజంగానే అక్కడ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సెలవు రోజుల్లో డీ మార్ట్ వద్ద రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. శనివారం, ఆదివారం వరుస సెలవుల నేపథ్యంలో రద్దీ విపరీతంగా ఉంది. ఈ సమయంలో నగరపాలక సంస్థ అధికారులు సుందరీకరణ పేరుతో నిర్వహిస్తున్న పనుల కోసం డీ మార్ట్ ఎదురుగా రోడ్డుపై మట్టి తోలారు. డీవైడర్ మధ్యలో ఉన్న పాత మట్టిని తొలగించి కొత్త మట్టి పోసేందుకు ఈ మట్టి తోలినట్లు తెలుస్తోంది. ఇంత వరకూ బాగానే ఉన్నప్పటికీ.. రద్దీ ప్రాంతాల్లో రాత్రివేళ తోలి తెల్లవారేసరికి డివైడర్లలో మట్టి పోసి రోడ్లను శుభ్రంగా ఉంచితే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగే అవకాశం ఉండదు. కానీ, అలా కాకుండా అత్యంత రద్దీగా ఉండే డీ మార్ట్ వద్ద అదీ సెలవు రోజుల్లో రోడ్డుపై మట్టి తోలడంతో శనివారం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో డీ మార్ట్‌కు వచ్చివెళ్లే ప్రజలతో పాటు ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే వేలాది మంది అష్టకష్టాలు పడ్డారు. మట్టి తోలిన సిబ్బంది కూడా ఇష్టారీతిన రోడ్డుపై సగం వరకూ వేయడం, ఇదే రోడ్డులో ఫంక్షన్ హాళ్లు, డీ మార్ట్, ప్రభుత్వ వైద్యశాల ఉండటంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నరకం చూశారు. శనివారం ఉదయం నుంచే మట్టిని రోడ్డుపై నిల్వ చేయడంతో రోజంతా ట్రాఫిక్ అంతరాయం కలిగి నగరపాలక సంస్థ అధికారులు, పాలకుల తీరును ప్రజలు అసహ్యించుకున్నారు. రద్దీ ప్రాంతాల్లో ఇలాంటి పనులు చేపట్టే సమయంలో రద్దీ తక్కువగా ఉండే సమయంలో, ఇంకా కుదిరితే రాత్రివేళల్లో పనులు చేపట్టి వీలైనంత త్వరగా ముగిస్తే ప్రజలు, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా ఉంటుంది. కానీ, అధికారులు అలాంటి ఆలోచన చేయకుండా అడ్డదిడ్డంగా పనులు చేస్తుండటంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

మన్నం శ్రీధర్‌కు బూచేపల్లి వెంకాయమ్మ పరామర్శ


మన్నం శ్రీధర్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: పొదిలిలో జగనన్న పోరుబాటలో చెలరేగిన వివాదంపై వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌ను పొదిలి పోలీసులు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో చీమకుర్తిలో అరెస్ట్ చేశారు. శనివారం పొదిలి కోర్టుకు తీసుకెళ్లడంతో సమాచారం అందుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పొదిలి చేరుకుని మన్నం శ్రీధర్ కలుసుకుని పరామర్శించారు. అక్రమ కేసులు, అరెస్టులను ఖండించారు.

23న ఎండోమెంట్ భూములకు వేలం

సంతనూతలపాడు: మండలంలోని త్రిపురాంతక, చెన్నకేశవ స్వాములు, వీర్ల వారి కుంటకు సంబంధించిన 102 ఎకరాల 37 సెంట్ల ఎండోమెంట్ భూములకు ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు మండల ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరానికి సంబంధించి ఈ భూములకు కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంతనూతలపాడులోని చెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించి బొడ్డువారిపాలెం, సంతనూతలపాడు, మంగమూరు గ్రామాల పరిధిలో గల 25 ఎకరాల 58 సెంట్ల భూములకు ఆయా ఆలయ ప్రాంగణంలో బహిరంగంగా కౌలు వేలం పాట జరగనున్నట్లు ఈవో వెల్లడించారు. అదేవిధంగా వీర్ల వారి కుంటకు సంబంధించి బొడ్డువారిపాలెం గ్రామ పరిధిలో గల 10 ఎకరాల 72 సెంట్ల భూములకు అదేరోజు ఆయా ఆలయ ప్రాంగణంలో కౌలు వేలం పాట జరగనున్నట్లు ఆయన వెల్లడించారు. సంతనూతలపాడులోని త్రిపురాంతక స్వామి దేవస్థానానికి సంబంధించి మైనంపాడు, సంతనూతలపాడు, బొడ్డువారిపాలెం, చంద్రపాలెం, గుడిపాడు, గురువారెడ్డిపాలెం గ్రామాల పరిధిలో గల 66 ఎకరాల 7 సెంట్ల భూములకు అదేరోజు ఉదయం 11 గంటలకు సంతనూతలపాడులోని త్రిపురాంతక స్వామి ఆలయ ప్రాంగణంలో కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో వివరించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒక సంవత్సరానికి ఎండోమెంట్ భూములకు బహిరంగ కౌలు వేలం జరగనున్నట్లు ఆయన తెలిపారు. పాటలో పాల్గొనేవారు రూ.5 వేల డిపాజిట్ చెల్లించాలన్నారు. దేవస్థానానికి సంబంధించి గతంలో ఎటువంటి బకాయిలు ఉండరాదని తెలిపారు.

పచ్చ నేత పిచ్చి పని..!

- సీసీ రోడ్డు ధ్వంసం
- కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఇష్టారాజ్యం
- స్థానికులు ఫోన్లు చేసి ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు
- రోడ్డు పగలకొట్టడాన్ని అడ్డుకున్న వైఎస్సార్ సీపీ వర్గీయుడిని బలవంతంగా స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- అధికార పార్టీ కావడంతో పచ్చ నేతకు అధికార యంత్రాగం సహకరించడంపై ప్రజల విమర్శలు


అల్లూరులో సీసీ రోడ్డును పగలగొడుతున్న బంకా శ్రీనివాసరావు వర్గీయులు

కొత్తపట్నం: కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ అధికార పార్టీ అనే అహంకారంతో ఓ వ్యక్తి ఏకంగా ప్రభుత్వం నిర్మించిన సీసీ రోడ్డును పగలకొట్టి ధ్వంసం చేశాడు. దీనిపై అధికారులకు ఫోన్లు చేసి స్థానికులు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ స్పందించలేదు. చివరకు రోడ్డు పగలకొట్టడాన్ని అడ్డుకున్న వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తిని కొత్తపట్నం ఎస్సై సుధాకర్‌బాబు వచ్చి బలవంతంగా జీపులో ఎక్కించుకుని స్టేషన్‌కు తరలించడం చూసి స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. చట్టవిరుద్ధంగా రోడ్డును పగలకొడుతున్నప్పటికీ అధికార పార్టీ వాళ్లకు దాసోహం అన్నట్టుగా అధికారులు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొత్తగా రోడ్లు వేయాల్సిన అధికారులు, అధికార పార్టీ నాయకులే ఇలా రోడ్లను నాశనం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. శనివారం కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాల్లోకెళ్తే...

అల్లూరు గ్రామంలో మన్నేపల్లి సుబ్రహ్మణ్యం షాపు నుంచి కొండూరి సుబ్బారెడ్డి ఇంటి వరకు 3.75 మీటర్ల వెడల్పుతో 32.80 మీటర్ల పొడవుతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జెడ్పీ గ్రాంట్ ద్వారా రూ.3 లక్షల నిధులతో 2019–20వ సంవత్సరంలో సీసీ రోడ్డు నిర్మించారు. అల్లూరు గ్రామ సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ హయాంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ వారు ఈ సిమెంట్ రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి గ్రామ ప్రజలు ఆ రోడ్డుపై సౌకర్యంగా రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు పక్కనే ఉంటున్న టీడీపీ వర్గీయుడు బంకా శ్రీనివాసులు తన ఇంటి స్థలంలో 1/4 సెంటు స్థలం తగ్గిందని హైకోర్టును ఆశ్రయించాడు. అయితే, బంకా శ్రీనివాసులు ఇంటి స్థలం కోసం సీసీ రోడ్డును తొలగించరాదంటూ వైఎస్సార్ సీపీ వర్గీయుడు కొండూరి సుబ్బారెడ్డి ఒంగోలు కోర్టులో పిటీషన్ వేశారు. రెండు పిటీషన్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టులు ఎటువంటి తీర్పులు ఇవ్వకుండానే అధికార పార్టీ అనే అహంకారంతో టీడీపీ వర్గీయుడు బంకా శ్రీనివాసులు శనివారం ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు దినం కావడంతో కటింగ్ మిషన్‌తో సిమెంట్ రోడ్డును పగలకొట్టాడు. ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే కొండూరి సుబ్బారెడ్డితో పాటు స్థానికులు కొందరు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బంకా శ్రీనివాసులు ద్వారా సమాచారం అందుకున్న కొత్తపట్నం ఎస్సై సుధాకర్ బాబు, పోలీస్ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి కొండూరి సుబ్బారెడ్డిని బలవంతంగా జీపులో ఎక్కించుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నన్ను ఎందుకు స్టేషన్‌కు తీసుకెళ్తున్నారని, ఎవరైనా నాపై కేసు పెట్టారా అని ఎస్సైని కొండూరి సుబ్బారెడ్డి అడిగినా కనీస సమాధానం కూడా చెప్పకుండా అతన్ని స్టేషన్‌కు తరలించారు. బంకా శ్రీనివాసరావు, అతని కుటుంబీకులు కలిసి కూలీలు, కటింగ్ మిషన్ సహాయంతో సిమెంట్ రోడ్డును 1.1/2 అడుగుల వెడల్పుతో కట్ చేశారు. రోడ్డు వెడల్పు తగ్గించారు. ఇంత జరుగుతున్నా.. స్థానికులు ఫోన్లు చేసి చెప్పినా అధికారులెవరూ స్పందించకుండా రోడ్డును ధ్వంసం చేయడానికి టీడీపీ వర్గీయుడికి సహకరించడంపై పెద్ద ఎత్తున గ్రామస్తులు విమర్శిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి విచారించి ప్రభుత్వం నిర్మించిన రోడ్డును ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొండూరి సుబ్బారెడ్డి, గ్రామస్తులు కోరుతున్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ జరపాలి

- వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు పారదర్శకంగా జరగాలి
- ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ డిమాండ్

ఒంగోలు సబర్బన్: వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల కౌన్సెలింగ్ జూమ్ మీటింగ్ ద్వారా జరపాలని నిర్ణయించడాన్ని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే శరత్ బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఎన్‌జీఓ హోంలో శనివారం జరిగిన పత్రికా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కౌన్సెలింగ్ జూమ్ మీటింగ్ ద్వారా జరిపితే ఉద్యోగులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. బదిలీలు పారదర్శకంగా ఉండాలంటే జూమ్ విధానంలో కాకుండా మాన్యువల్ విధానం లోనే జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్, కార్యదర్శి షేక్ మగ్దుమ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్


చంటిబిడ్డతో కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయురాలు

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎస్జీటీ ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క పాఠశాలలు ప్రారంభమై పిల్లలు బడులకు వస్తుంటే.. ఉపాధ్యాయులు మాత్రం ఎస్జీటీల కౌన్సెలింగ్లో బిజీబిజీగా ఉన్నారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలి. కానీ, కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో ఎస్జీటీ ఉపాధ్యాయులు రెండు రోజులుగా రాత్రింబవళ్లు జరుగుతున్న బదిలీల ప్రక్రియలో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కౌన్సిలింగ్‌కు వచ్చిన కొందరు ఉపాధ్యాయులు తమ చిన్నారులను చూసుకుంటూ ఇబ్బందులు పడుతూ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

కవులు, కళాకారుల జీవితం అజరామరం


నటరాజస్వామి విగ్రహానికి పూజ చేస్తున్న కవులు, కళాకారులు

ఒంగోలు మెట్రో: కవులు, కళాకారులు వారి సాహిత్యం ద్వారా, కళారూపాల ద్వారా వారి జీవితాలను ధన్యం చేసుకున్నారని రంగభూమి కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ నెలలో మరణించిన కవులు, కళాకారులపై ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా బేబీ బృందంలోని మువ్వ నాగేశ్వరరావు, చక్రాల మల్లికార్జునరావు, మిలటరీ కోటేశ్వరరావు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. నటరాజస్వామి విగ్రహానికి పుష్పాలతో పూజ చేశారు. పలువురు కవులు, కళాకారులు పాల్గొని ప్రముఖుల గురించి ప్రసంగించారు.

ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో 'రాజీ'కీయం

- ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున వాగ్వివాదం

సంతనూతలపాడు: ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ కార్యాలయంలో ఓ యాక్సిడెంట్‌కు సంబంధించి కేసు పెట్టకుండా రాజీ చేసేందుకు శనివారం జరిగిన చర్చల్లో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున వాగ్వివాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే విజయకుమార్ అనుచరుడైన మంగమూరుకు చెందిన టీడీపీ నాయకుడు వారం క్రితం మద్యం మత్తులో మోటారు సైకిల్‌పై ఒంగోలు నుంచి మంగమూరు వెళ్తున్నాడు. అదే సమయంలో మోటారు సైకిల్‌పై ఒంగోలు వెళ్తున్న వ్యక్తిని, వెనుక కూర్చుని ఉన్న అతని 8 ఏళ్ల వయసున్న చిన్నారిని ఢీకొట్టాడు. బాధితులిద్దరూ ఒంగోలులోని జీజీహెచ్‌లో చేరి చికిత్స పొందడంతో ఎంఎల్సీ నమోదు చేశారు. దీనిపై అధికార పార్టీ అనే అహంకారంతో పాటు ఎమ్మెల్యే అనుచరుడిని అనే పలుకుబడితో మంగమూరుకు చెందిన టీడీపీ నాయకుడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాకుండా అడ్డుకున్నాడు. పోలీసులు కూడా ఫిర్యాదు ఉన్నప్పటికీ కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు కాకుండా రాజీ చేసుకునేందుకు శనివారం బాధితులను ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ కార్యాలయానికి పిలిపించి చర్చలు జరిపారు. కేసు నమోదు కాకుండా రాజీ చేసుకోవాలని బాధితులపై ఒత్తిడి చేశారు. అయితే, బాధితులు అందుకు అంగీకరించకపోవడంతో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున వాదన జరిగినట్లు తెలిసింది. ఎమ్మెల్యే కార్యాలయం కేంద్రంగా కేసుల రాజీ కోసం బాధితులపై ఒత్తిడి చేసి గొడవకు దిగిన విషయం బయటకు రావడంతో తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

ఘనంగా పేస్ కాలేజీ గ్రాడ్యుయేషన్ డే


కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, కాలేజీ యాజమాన్యం

ఒంగోలు సిటీ: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాల తృతీయ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఒంగోలులోని ఎస్‌జీవీఎస్ కన్వెన్షన్లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల వైస్ చైర్మన్ మద్దిశెట్టి వాసుబాబు, టీసీఎస్ డెలివరీ హెడ్ ఎంఎస్ సుబ్రహ్మణ్యం, సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ శరణం నరేంద్రకుమార్, క్వాల్‌కం డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ముందుగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ అతిథులకు పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి సభకు పరిచయం చేశారు. 2025 అకడమిక్ ఇయర్లో ఫైనలియర్ ఉత్తీర్ణులైన వివిధ శాఖలకు చెందిన 1100 మంది బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ మద్దిశెట్టి వాసుబాబు మాట్లాడుతూ విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు నిబద్ధత, విలువలు పాటించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, కళాశాల డీన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ కే రూప ఆకేష్, పరీక్షల నియంత్రణాధికారి జి.ఇ.బాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పునీత ఆంథోని చర్చి మహోత్సవం


మాట్లాడుతున్న ఆంథోని దాస్

దొనకొండ: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో పునీత ఆంథోని ఆలయ మహోత్సవం విచారణ గురువు ఫాదర్ గుడిపల్లి థామస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహోత్సవానికి నెల్లూరు మేత్రాసనం సహవారస పీఠాధిపతులు డాక్టర్ పిల్లి ఆంథోనిదాస్ అతిథిగా హాజరై దివ్యబలి పూజ సమర్పించారు. ఉదయం నుంచి పిల్లలు, పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో వచ్చి దివ్యబలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పునీత ఆంథోని వారి జీవితంలోని అద్భుత విషయాలను ఆయన వివరించారు. అనంతరం పునీత ఆంథోని వారి తేరును పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి వీధుల్లో మేళతాళాలతో గీతాలాపన చేస్తూ ఉత్సవం చేశారు. విచారణ గురువులు గుడిపల్లి థామస్, సహాయ గురువులు వినోద్‌కుమార్, గురుశ్రీ పిడతల జోసఫ్, గురుశ్రీ కలివెల చంద్ర, ఇతర గురువులు, ఆరోగ్యమాత సిస్టర్స్ పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపంలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గొబ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఐదో రోజు ఉత్సమూర్తులు గరుడ వాహనంపై శనివారం ఉంచారు. శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, మంగళ హారతి, ప్రసాద వితరణ తదితర పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పగలు ఉత్సవం పల్లకిలో రాత్రి గరుడ వాహనంపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామిని ఆలయం ప్రాంగణంలో ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఉభయదాతలుగా బోయినపల్లి చిన్నసత్యనారాయణ, ఓరుగంటి విద్యాసాగర్, పెరుగుపల్లి సుబ్రహ్మణ్యం, పవన్‌కుమార్, కొండూరు ఆదినారాయణశర్మలు వ్యవహరించారు. బ్రహ్మణ, రెడ్ల సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవం


కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


సీతాకోదండరామస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు మండలంలోని సర్వేరెడ్డిపాలెంలో ఉన్న కోదండరామస్వామి దేవస్థానం 23వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తులకు పంచామృతాభిషేకం, స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ, అర్చన, పూజ కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన మండపంలో చూడచక్కగా అలంకరించిన వేదికపై కోదండరామస్వామి, సీతమ్మలకు పరిణయాన్ని శోభాయమానంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు పరాంకుశం కేశవాచార్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితుడు నారాయణ వెంకట రమణాచార్యులు పర్యవేక్షణలో వేద పండితులు పరాంకుశం చక్రవర్తి, పరాంకుశం రంగా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించి అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.